సోమవారం । 11 । ఆగస్టు । 2025



కట్టడి చేసినా..
జిల్లాలో గంజాయి కట్టడికి పోలీసులు ఎంత ప్రయత్నం చేస్తున్నా.. స్మగ్లర్లు ఏదో ఒకవిధంగా తమ దందాను కొనసాగిస్తున్నారు.
- 8లో ▸



కళాశాలల్లో మధ్యాహ్న..
జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కలగానే మిగిలిపోతుందేమోనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.9 /22.2

వాతావరణం
ఉదయం చల్లటి గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

13న మార్కింగ్ మహామేళా

నిజామాబాద్ అర్బన్: ఈ నెల 13వ తేదీన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల 'మార్కింగ్ మహా మేళా' నిర్వహించనున్నట్లు కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మేళాలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రొసీడింగ్స్ పూర్తయి మార్కింగ్ చేసుకోలేకపోయిన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి 13వ తేదీన మార్కింగ్ పూర్తి చేసి, పనులు ప్రారంభించేలా ప్రోత్సహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 17,301మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, వాటిలో ఇప్పటికే 9,486 ఇళ్ల గ్రౌండింగ్ పూర్తయిందని కలెక్టర్ వివరించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి బుధవారం రోజున మార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్ అర్బన్: అర్హత ఉన్న కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం(ఎన్‌ఎఫ్‌బీఎస్) పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినప్పుడు.. బాధిత కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందన్నారు. మరణించిన వ్యక్తి వయస్సు 18 నుంచి 60 ఏళ్ల లోపు ఉండాలని సూచించారు. అర్హత ఉన్న కుటుంబాలు తహసీల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బాధిత కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేలా విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు.

నేడు, రేపు సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపికలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లా సీనియర్ బేస్‌బాల్ జట్ల ఎంపికలు సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. మధుసూదన్ రెడ్డి, సొప్పరి వినోద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ పాఠశాల క్రీడామైదానంలో సోమవారం ఉదయం 10 గంటలకు మహిళా జట్టు ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 12న ఉదయం 10 గంటలకు ఆర్మూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడా మైదానంలో పురుషుల జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేశ్, మౌనిక, జ్యోత్స్న, నర్మదలకు రిపోర్ట్ చేయాలని సూచించారు.


పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నందిపేట్(ఆర్మూర్): నందిపేట పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం సోమవారం ఉదయం 11 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. పదవ తరగతి పాసైన అభ్యర్థులు ఒరిజినల్ టీసీ, రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, ఆధారు జిరాక్స్, 3 ఫొటోలతోపాటు రూ.6,180 ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల సంస్థలో ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని అన్నారు.

తెయూ ఇంజినీరింగ్ కళాశాలకు విద్యార్థుల కేటాయింపు

తెయూ(డిచ్‌పల్లి): నూతనంగా ఏర్పాటైన తెలంగాణ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో 3వ విడత కౌన్సిలింగ్‌లో 81 మంది విద్యార్థులను అధికారులు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి ఆదివారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్‌సీ)లో 65, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఏఐ)లో 9, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) విభాగంలో 4, డాటా సైన్సెస్ విభాగంలో ముగ్గురు విద్యార్థుల చొప్పున కన్వీనర్ కోటా ద్వారా కళాశాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. కాగా, వీరిలో ఎంత మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్ తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా ఇంటర్నల్ స్లైడింగ్ ద్వారా కొన్ని విభాగాల్లో విద్యార్థుల సంఖ్య మారే అవకాశం ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇదే చివరి విడత కౌన్సిలింగ్ అని ప్రకటించినా కొత్తగా ఇంజినీరింగ్ కళాశాల కావడంతో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రెడ్ నోటీస్



నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దశాబ్దాలుగా పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్న వారిపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 1996 నుంచి పన్ను చెల్లించని వారి జాబితాను రూపొందించారు. వివిధ కారణాలు చూపుతూ కోర్టుకు వెళ్లిన వారు.. నాటి నుంచి పాత, కొత్త పన్ను చెల్లించడం లేదు. అధికారులు ప్రశ్నిస్తే వ్యవహారం కోర్టులో ఉందంటూ తప్పించుకుంటున్నారు. అయితే రూ.26 కోట్ల మొండి బకాయిలను వసూలు చేసే లక్ష్యంతో అధికారులు శుక్రవారం నుంచి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

- నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి
- 1996 నుంచి పన్ను చెల్లించని వారి జాబితా సిద్ధం
- రూ.26 కోట్ల మేర పాతబకాయిలు
- రెండు స్టార్ హోటళ్లు చెల్లించాల్సింది రూ.13 కోట్లు..
- కోర్టు కేసులంటూ అసలుకే చెల్లించని వైనం
- కలెక్టర్ ఆదేశాల మేరకు నోటీసులిస్తున్న అధికారులు

నిజామాబాద్ సిటీ: మొండి బకాయిలు నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు తలకుమించిన భారంగా మారాయి. కోట్లాది రూపాయల వసూలు కాకపోవడంతో బల్దియా ఆదాయానికి గండిపడుతోంది. పలువురు బడా వ్యాపారులు కోర్టుల్లో కేసులు వేసి పన్నులు చెల్లించకుండా దర్జాగా వ్యాపారాలు చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. బల్దియాకు చెల్లించాల్సిన పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మొండి బకాయిలపై జిల్లా కలెక్టర్, ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి బకాయి వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పెండింగ్ పన్ను వసూళ్ల కోసం కమిషనర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

కోర్టు కేసులంటూ..

అధికారులు పన్ను ఎక్కువ వేశారంటూ కొందరు కోర్టులో కేసులు వేశారు. అయితే తీర్పు రాకపోవడాన్ని సాకుగా చూపుతున్నారు. ప్రతి సంవత్సరం చెల్లించాల్సిన పన్ను సైతం చెల్లించడం లేదు. నగరంలోని రెండు ప్రముఖ హోటళ్లే రూ.13 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని తెలిసింది. వీరితోపాటు బహుళ అంతస్తుల భవనాలు, మల్టీప్లెక్స్‌లు, ఫర్నిచర్ షాపులు, ఆస్పత్రులు కూడా మొండి బకాయిల లిస్టులో ఉన్నట్లు తెలిసింది.

1200 అసెస్‌మెంట్లు

పన్ను చెల్లించకుండా తప్పించుకుంటున్నవారిని బల్దియా రెవెన్యూ అధికారులు గుర్తించారు. వారిలో 1996 నుంచి పన్ను చెల్లించని వారి పేర్లు సైతం ఉన్నాయి. మొత్తం 1200 అసెస్‌మెంట్లను గుర్తించిన అధికారులు వారికి రెడ్ నోటీసులు అందజేస్తున్నారు. వారం రోజుల్లో పన్ను చెల్లించకుంటే చర్యలు తప్పవని, స్పందించని పక్షంలో సీజ్ చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

కలెక్టర్ ప్రత్యేక దృష్టి

బకాయి వసూళ్లపై కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి దృష్టి సారించారు. కోర్టు కేసులంటూ తప్పించుకునేవారిని ఉపేక్షించొద్దని అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నోటీసులు ఇవ్వాలని, నోటీసులు తీసుకుని స్పందించని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఉన్నతస్థాయి నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో రూ.26 కోట్లు వసూలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పెద్దలను ఎందుకు వదిలేస్తారు..



సాధారణ పౌరులు బల్దియాకు పన్ను చెల్లించకుంటే ఇంటికి వచ్చి మరీ వసూలు చేస్తున్నారు. పెద్దవాళ్లని ఎందుకు వదిలేస్తున్నారు. స్టార్ హోటళ్లు, పెద్ద దుకాణదారులను ఉపేక్షించడం సరి కాదు. అందరికీ ఒకే న్యాయం ఉండాలి. పన్ను రికవరీలో బల్దియా అధికారుల ఉదాసీనత సరికాదు.
– వి.ప్రభాకర్, న్యూడెమోక్రసీ (మాస్‌లైన్) రాష్ట్ర నాయకుడు

స్పెషల్ డ్రైవ్‌తో..




కార్పొరేషన్ పరిధిలో రూ.26 కోట్లు పెండింగ్ బకాయి లున్నట్లు గుర్తించాం. చెల్లించాల్సిన వారికి రెడ్‌నోటీసులు జారీచేస్తున్నాం. గడువులోగా చెల్లించకుంటే కఠిన చర్యలు తప్పవు. అవసరమైతే సీజ్‌లు చేస్తాం. ప్రతి ఒక్కరూ విధిగా పన్ను చెల్లించాలి. ఎవరినీ ఉపేక్షించేది లేదు. – దిలీప్‌కుమార్, బల్దియా కమిషనర్

నులిపురుగులను నివారిద్దాం

- అల్బెండజోల్ పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- జిల్లాలో 4లక్షలకుపైగా 1-19 సంవత్సరాల పిల్లలు
- నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

నిజామాబాద్‌నాగారం/బోధన్ రూరల్: నులి పురుగులతో నెలల వయసు నుంచి పెద్దల వరకు ఇబ్బందులు పడుతుంటారు. ఇవి సులువుగా పొట్టలోకి చేరి హాని కలిగిస్తున్నాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండే వారిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. ఈ నెల 11న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా 1-19 ఏళ్లలోపు పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది.

నాలుగు లక్షలకు పైగా..
జిల్లాలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలు, 1262 ప్రభుత్వ, 569 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటితోపాటు కేజీబీవీ, మోడల్, సోషల్, బీసీ, ట్రైబల్, మైనార్టీ వెల్ఫేర్ విద్యాసంస్థలతోపాటు మదర్సాలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,10,032 మంది చిన్నారులుండగా, పాఠశాలలు, కళాశాలల్లో 2,95,411 మంది విద్యార్థులున్నారు. వీరందరికీ సోమవారం అల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది వేయనున్నారు.



మాత్రలు ఇలా వేసుకోవాలి

- 1- 2 సంవత్సరాల పిల్లలకు సగం మాత్రను పొడిగా చేసి నీటిలో కలిపి వేయించాలి.
- 2- 3 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను పూర్తిగా పొడి చేసి కొద్దిగా నీటిని కలిపి వేయాలి.
- 3 -19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను బాగా చప్పరించి, నమిలి మింగేలా చూడాలి.
- భోజనం తర్వాతే ఈ మాత్ర వేయాలి. ఖాళీ కడుపుతో ఉన్నప్పుడు వేయొద్దు.

అపోహ వద్దు.. ఆరోగ్యానికి మంచిది



అల్బెండజోల్ మాత్ర వేసుకోవడంతో పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించి పోషకాహార లోపాలని అరికట్టవచ్చు. పరిసరాల, వ్యక్తిగత శుభ్రతతో నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చు. సోమవారం 1-19 ఏళ్ల పిల్లలందరికీ మాత్రలు వేయించాలి. అనారోగ్య కారణాలతో ఎవరైనా వేసుకోకుంటే ఈ నెల 18న అయినా వేయించాలి. అల్బెండజోల్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. – రాజశ్రీ, డీఎంహెచ్‌వో

ఎస్సారెస్పీలోకి 35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- మరింత పెరిగే అవకాశం ఉందంటున్న అధికారులు
- కాలువలకు కొనసాగుతున్న నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఆదివారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన ఇన్‌ఫ్లో సాయంత్రానికి 35 వేల క్యూసెక్కులకు చేరగా, ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. కాకతీయ కాలువ ద్వారా 3,500, వరద కాలువ ద్వారా 3 వేలు, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 200, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360, గుత్ప లిఫ్ట్ ద్వారా 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 462 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 1079.20 (42.8 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

నిజాంసాగర్‌లోకి 5,393 క్యూసెక్కులు..
నిజాంసాగర్: ఎగువన మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం 5,393 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ అక్షయ్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1,391.5(4.723 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

చేపపిల్లల ఉత్పత్తి ప్రయోగం విఫలం

- సుమారు కోటి స్పాన్‌కు నష్టం
- ప్రస్తుత సీజన్‌లో రెండుసార్లు ఫెయిల్
- ప్రతికూల వాతావరణమే కారణమంటున్న అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రయోగం రెండుసార్లు విఫలమైంది. దీంతో సుమారు కోటి స్పాన్ ఉత్పత్తికి నష్టం ఏర్పడింది. ప్రస్తుత సంవత్సరం 54 లక్షల చేప పిల్లల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకోగా అందుకు 2.4 కోట్ల స్పాన్ ఉత్పత్తి కావాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు 1.75 కోట్ల స్పాన్ మాత్రమే ఉత్పత్తి అవ్వగా, మిగతా స్పాన్ కోసం ఎకో హేచరీలో రెండుసార్లు ప్రయోగం చేశారు. ఆ ప్రయోగం విఫలం కావడంతో స్పాన్ ఉత్పత్తి కావడం లేదు. దీంతో ప్రభుత్వ సొమ్ము వృథా అవుతోంది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కొరవడడం కూడా ఒక కారణంగా మత్స్యకారులు చెప్తున్నారు.

ఉత్పత్తిపై అనుమానాలు
చేపపిల్లల ఉత్పత్తికి జూలై, ఆగస్టు నెలలు అనుకూల సమయం. చెరువులు, ప్రాజెక్టుల్లో సహజసిద్ధంగానే ఈ రెండు నెలల్లో చేపలు పిల్లలను ఉత్పత్తి చేస్తాయి. కానీ, ప్రతికూల వాతావరణం కారణంగానే స్పాన్ ఉత్పత్తి ప్రయోగం విఫలమైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో చేపపిల్లల ఉత్పత్తి అంశంపై ఉన్నతాధికారులు స్పందించాలని మత్స్యకారులు కోరుతున్నారు. 5 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఉన్న కేంద్రంలో ప్రస్తుతం 10శాతం కూడా చేపపిల్లల ఉత్పత్తి జరిగేలా లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చేప పిల్లలు ఉత్పత్తి చేసే ఎకో హేచరీలు

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం

ప్రస్తుతం వాతావరణం చల్లగా లేకపోవడంతోనే రెండుసార్లు చేపపిల్లల ఉత్పత్తి ప్రయోగం విఫలమైంది. సుమారుగా కోటి స్పాన్ ఉత్పత్తికి నష్టం వాటిల్లింది. ప్రస్తుత సంవత్సర లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ఐస్ వేసి చేపపిల్లల ఉత్పత్తి చేపడ్తాం.
– దామోదర్, మత్స్య అభివృద్ధి అధికారి, పోచంపాడ్

రాజకీయ దురుద్దేశంతోనే దుష్ప్రచారం

- మాజీ సీఎం కేసీఆర్‌పై రాజకీయ కక్ష
- అది ఘోష్ కమిటీ కాదు.. ఘోస్ట్ కమిటీ
- చంద్రబాబు మెప్పుకోసమే బనకచర్లకు నీళ్లు
- కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్‌ను టార్గెట్ చేశాయి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మీద రాజకీయ కక్షతోనే కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్యాలు ప్రచారం చేస్తూ, ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయకుండా రైతాంగానికి అన్యాయం చేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని చివరి ఆయకట్టు వరకు మూడు పంటలకు సాగునీరివ్వాలన్న ఆలోచనతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించామన్నారు. ప్రాజెక్టులోని చిన్న సమస్యను పరిష్కరించకుండా కొండంత చేసి దుష్ప్రచారం చేయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకున్నదన్నారు. మేడిగడ్డను పండబెట్టి బనకచర్లకు గోదావరి నీళ్లను దోచిపెడుతూ తన గురువు చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ ఇచ్చాడని విమర్శించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, బీజేపీ కలిసి ఇచ్చిన రిపోర్టునే జస్టిస్ ఘోష్ ఇచ్చారని, అది కోర్టులో చెల్లదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో సుంకిశాల గోడలు, ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయిందని, పెద్దవాగుకు గండపడినా సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిపై ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో కేసీఆర్, హరీశ్‌రావులను ఎలా బాధ్యులను చేస్తారన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో మళ్లీ పాత రోజులు గుర్తుకు వస్తున్నాయని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ కేంద్ర సహాయమంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ ఘోష్ కమిషన్ ముందుకు వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. బండి సంజయ్ బజారు భాష మాట్లాడుతున్నారని, కేటీఆర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలకు సభ్యసమాజం సిగ్గుపడుతుందన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, సత్యప్రకాశ్, సిర్పరాజు, సుజిత్ సింగ్, దొన్కంటి నర్సయ్య, బాజిరెడ్డి రమాకాంత్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

బీమా.. రైతన్నకు ధీమా

- కొత్త దరఖాస్తులకు ఆహ్వానం
- జూన్ 5నాటికి పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులకు అవకాశం
- ఈ నెల 13 వరకు గడువు

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రైతుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. ప్రమాదవశాత్తు రైతు మరణిస్తే వారి కుటుంబసభ్యులకు బాసటగా నిలుస్తోంది. రూ.5లక్షల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతోంది. ఈ పథకానికి రైతులపై భారం లేకుండా ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లిస్తోంది. ప్రస్తుతం బీమా చేసుకోవడానికి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ నెల 13వరకు గడువు ఉండగా అర్హులైన రైతులు దరఖాస్తులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచిస్తోంది.



ఏడేళ్లుగా బీమా పొందిన రైతు కుటుంబాలు

సంవత్సరం	రైతు కుటుంబాలు	పొందిన డబ్బులు (రూ.కోట్లలో)
2018-19	703	35.15
2019-20	866	43.30
2020-21	1,341	67.05
2021-22	1,047	52.35
2022-23	1,035	51.75
2023-24	1,204	60.20
2024-25	946	47.30

జిల్లాలో 1.69లక్షల మంది నమోదు
రైతుబీమా పథకానికి జిల్లాలో ఇప్పటి వరకు 1.69లక్షల మంది నమోదు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం ఏడాదికోసారి ప్రీమియం చెల్లించి రెన్యువల్ చేస్తూ వస్తోంది. గడిచిన ఏడేళ్లలో 7,135మంది రైతులు మరణించగా, వారి కుటుంబాలకు రూ.357.10కోట్లు ప్రభుత్వం చెల్లించింది. ప్రస్తుతం జూన్ 5నాటికి కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు జిల్లా వ్యాప్తంగా ఐదారు వేల మంది ఉన్నట్లుగా వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. వీరు బీమా కోసం దరఖాస్తు చేసుకుంటే లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది.

అర్హతలు ఇవే..

- జూన్ 5వ తేదీ నాటికి పట్టాదారుగా నమోదై ఉండాలి.
- 18–59 సంవత్సరాల వయసు ఉండాలి.
- రైతు, నామినీ ఆధార్ కార్డు, పట్టాదారు పుస్తకం జిరాక్స్ పత్రాలతోపాటు దరఖాస్తు ఫారాన్ని నేరుగా రైతువేదికల్లో ఏఈవోలకు సమర్పించాలి.
- పట్టా పుస్తకం రానివారు ఆన్‌లైన్‌లో డిజిటల్ సైన్ ఉన్నా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది.

ఏఈవోలను సంప్రదించాలి



రైతుబీమా పథకాన్ని అర్హులైన ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. కొత్త పట్టా పాసు పుస్తకాలు వచ్చిన వారు దరఖాస్తు చేసుకోవాలి. నేరుగా రైతు వేదికల్లోని ఏఈవోలను సంప్రదించాలి.
– మేకల గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి

భయపెడుతున్న చిరుత పులి

- మొన్న సిద్ధుల గుట్టపై, ఇప్పుడు పెద్దమ్మ గుడి పరిసరాల్లో..
- ఆర్మూర్ పట్టణ ప్రజల్లో కలవరం

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ సిద్దుల గుట్టపై మూడు నెలల క్రితం చిరుత సంచారం పట్టణ ప్రజలతోపాటు సందర్శకులను కంటి మీద కునుకులేకుండా చేసింది. తాజాగా గుట్టకు అతి సమీపంలోని పెద్దమ్మ ఆలయ పరిసరాల్లో చిరుత సంచారం ప్రజలను కలవరపెడుతోంది. శుక్రవారం ఆలయానికి వచ్చిన భక్తులకు చిరుత కదలికలు భయాందోళనకు గురిచేశాయి. అంకాపూర్‌కు చెందిన ఓ గొర్రెల మంద నుంచి రెండు మేకలు కనిపించకపోవడం చిరుత సంచారానికి బలం చేకూర్చింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు ఆదివారం చిరుత ఆనవాళ్ల కోసం కొండ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. కాగా, శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఆనవాళ్లేమీ కనిపించలేదు. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా వెళ్లొద్దని అధికారులు సూచించారు.



పెద్దమ్మ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

క్లుప్తంగా

ఉప్లూర్ చెరువులో మొసలి



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ నల్ల చెరువులో ఆదివారం ఉదయం మొసలి కనిపించడం కలకలం రేపింది. చెరువు మధ్యలో నీటిపై ఏదో కదులుతున్నట్లు కనిపించడంతో స్థానిక రైతుతు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించారు. మొసలి కావడంతో గ్రామ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడంతో ఈ విషయం కలకలం రేపుతోంది. చెరువు విస్తీర్ణం పెదద్దిగా ఉండడంతో మొసలి ఎటు వైపు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. మూడు నాలుగు నెలల క్రితం కూడా చెరువులో మొసలి కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి మొసలిని పట్టుకొని బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్లపై నిలుస్తోన్న వాన నీరు

- కేకేవై రహదారిలో వాహనదారులకు ఇబ్బందులు



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం గుండా వెళ్లే కేకేవై (కరీంనగర్–కామారెడ్డి–ఎల్లారెడ్డి) వంద ఫీట్ల రోడ్డు కబ్జాలు ఒకవైపు, మరో వైపు ఉన్న రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో రోడ్లపై నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంద ఫీట్ల కేకేవై రోడ్డు పట్టణంలో సిరిసిల్లరోడ్డు, స్టేషన్‌రోడ్డు, పోలీసు స్టేషన్, రైల్వే బ్రిడ్జి మీదుగా ఉంది. ఈ రోడ్డులో ఎక్కడికక్కడ అక్రమ కట్టడాలతో కబ్జా చేశారు. సిరిసిల్ల రోడ్డులో కేకేవై నుంచి రామేశ్వరపల్లి వెళ్లే జాతీయ రహదారి సర్వీసు రోడ్డు సైతం ఇలాగే వాన నీటితో నిండిపోయింది. జాతీయ రహదారి నిర్వాహకులు మూసుకుపోయిన మురికికాల్వల్లో మట్టిని తొలగించకపోవడంతో నీరు రోడ్డుపై నిలుస్తోంది. ఉన్నతాధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అడవి పందుల దాడిలో మొక్కజొన్న పంట ధ్వంసం



రాజంపేట : ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతుకు ఏదో ఒక రూపంలో కష్టాలు తప్పడం లేదు. రాజంపేట మండలం బస్వన్నపల్లి గ్రామంలోని రాజిరెడ్డి అనే రైతు తనకున్న రెండు ఎకరాల భూమిలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. శనివారం రాత్రి అడవి పందులు మొక్కజొన్న పంటపై దాడి చేసి బీభత్సాన్ని సృష్టించాయి. దీంతో మొక్కజొన్న పంట మొత్తం నేలవాలింది. అడవి పందులు రాకుండా ఎన్ని ప్రయత్నాలు చేసిన వాటి దాడుల నుంచి పంటను కాపాడుకోలేకపోతున్నామని బోరున విలపిస్తున్నారు.

తూము గండికి మరమ్మతులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్ డ్యాం ఎడమ కాలు తూముకు గండి పడి నీరు వృథాగా పోతున్న విషయం తెలిసిందే. నీటి పారుదల శాఖ అధికారులు రెండు రోజులుగా తూము గండిని పూడ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఆదివారం కూడ మరమ్మతు పనులు కొనసాగాయి. ఆయకట్టు పొలాల్లో నీరు చేరి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలల్లో 'మధ్యాహ్న భోజనం' కలేనా?

- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అమలుకు నోచుకోని పథకం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



అయిలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల



కళాశాల ఆవరణలో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థులు

నందిపేట్(ఆర్మూర్): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 'మధ్యాహ్న భోజన పథకం' కలగానే మిగిలిపోతుందేమోనని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని గతంలో ప్రతిపాదనలు పంపించినా ఇప్పటికీ అమలుకు నోచుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో కళాశాలలకు దూరప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మారుమూల గ్రామాల నుంచి పేద విద్యార్థులు ఆర్టీసీ బసుల్లో, సైకిళ్లపై సమీప పట్టణాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వచ్చి చదువుకుంటారు. దూరప్రాంతాల విద్యార్థులు ఇంటి నుంచి ఉదయం తొందరగా బయలుదేరితేనే కళాశాలకు సకాలంలో చేరుకుంటారు. ఈక్రమంలో కొందరు విద్యార్థులు ఇంట్లో ఉదయం టిఫిన్ తయారీతో ఆలస్యం కావడంతో టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకోకుండానే కళాశాలకు వెళుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తుండటంతో వారు అర్ధాకలితో అలమటిస్తున్నారు. దీంతో విద్యార్థులు పూర్తిస్థాయిలో చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు.

జిల్లాలో 31 కళాశాలలు..

జిల్లాలో 31 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు 9850 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో కొందరు విద్యార్థులు మాత్రమే నిత్యం తమ ఇంటి వద్ద నుంచి టిఫిన్ బాక్సులతోపాటు వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. మిగిలిన వారు అర్ధాకలితోనే విద్యను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.

టిఫిన్ బాక్స్ బాధలు తప్పతాయి..



ఉన్నత విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ఈ పథకం ద్వారా దూరప్రాంతాల విద్యార్థులకు మేలు జరుగుతుంది. ఇంటి నుంచి ఉదయం టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకునే బాధలు తప్పుతాయి.

–ఎం.కిరణ్మ, విద్యార్థిని, అయిలాపూర్ కళాశాల

దూరం నుంచి వస్తుంటాం..



కాలేజీకి దూర ప్రాంతాల నుంచి వస్తుంటాం. మా ఊరి నుంచి బస్సు కళాశాల టైం కన్నా ముందే వస్తుంది. దీంతో ఒక్కోసారి ఇంట్లో వంట కాకపోవడంతో టిఫిన్ బాక్స్ తెచ్చుకోవడం లేదు. అధికారులు ప్రభుత్వ బడుల్లో మాదిరిగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అందించాలి.

–అభినవ్, విద్యార్థి, అయిలాపూర్ కళాశాల

అనుమతులు వస్తేనే..

విద్యాశాఖ ఉన్నత అధికారుల నుంచి అనుమతులు రాగానే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తాం. నందిపేట మండలంలోని మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు ఎక్కువగా కళాశాలకు వస్తుంటారు. మధ్యాహ్న భోజనం సౌకర్యం కల్పిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉంటారు. వారికి సౌకర్యవంతంగా ఉంటుంది.

–చిన్నయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అయిలాపూర్



ఘనంగా అపూర్వ సమ్మేళనం

నగరశివారులోని బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదోతరగతి పూర్తయిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గ్రామంలోని కిసాన్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి రావడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.

– మోపాల్



ఎల్లమ్మకుంటలో గోధుమబుట్టలతో యువతులు



కృష్ణానగర్‌తండాలో తీజ్ పండుగ జరుపుకుంటున్న గిరిజనులు

తీజ్ సందడి

మోపాల్ : మండలంలోని ఎల్లమ్మకుంటలో ఆదివారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. పెళ్లి కాని యువతులు 9 రోజులపాటు గోధుమ బుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు గోధుమబుట్టలను ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంతకుముందు సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాతా ఆలయాల్లో పూజలు చేసి, బోగ్‌భండార్ నిర్వహించారు. వేడుకలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, కాంగ్రెస్ ఆదివాసీ, గిరిజన జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోహన్ నాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేశ్ నాయక్, బుజ్జి రతన్, తండా నాయక్ జోర్‌సింగ్ , కారొబార్ ప్రకాశ్ ఉన్నారు.

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ తండా, మదన్‌పల్లితండా, సట్లాపూర్‌తండా, కృష్ణానగర్‌తండాలలో గిరిజనులు తీజ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. గిరిజన యువతులు ముందుగా మొలకెత్తిన గోధుమ నారును నెత్తిన పెట్టుకుని సేవాలాల్ మందిరం వరకు ఊరేగింపుగా వెళ్లారు. గిరిజన మహిళలు వారి సంప్రదాయ దుస్తులను ధరించి నృత్యాలు చేశారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ మందిరం వద్ద నైవేద్యాలు సమర్పించి వన భోజనాలు చేశారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పతకాల పంట



పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్ : ఆదిలాబాద్‌లో ఈనెల 7, 8 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. జిల్లాకు ఎనిమిది పతకాలు వచ్చాయని యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి తెలిపారు. డి.సురేందర్ బ్యాక్ బెండింగ్ విభాగంలో బంగారు, ట్రెడిషన్ విభాగంలో రజత పతకాలు సాధించారని పేర్కొన్నారు. సీహెచ్.రాజ్‌కుమార్ ట్విస్టింగ్, సుపైన్‌లో కాంస్యం, ఫార్వర్డ్ బెండింగ్‌లో వెండి పతకాలు, యు.అనిల్‌కుమార్ ఫార్వర్డ్ బెండింగ్‌లో కాంస్యం, సీహెచ్.తిరుపతి హ్యాండ్ బ్యాలెన్స్‌లో కాంస్యం, ఏ.రాజు ట్రెడిషన్ విభాగంలో వెండి పతకాలు సాధించారని తెలిపారు. మరికొందరు క్రీడాకారులు ప్రశంసా పత్రాలు అందుకున్నారన్నారు.

ఎస్సారెస్పీలోకి గుర్రపు డెక్క





ఎస్సారెస్పీ నీటిలో తేలియాడుతున్న గుర్రపు డెక్క

- ఎగువ ప్రాంతాల నుంచి వరదతోపాటు కొట్టుకువస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటితో పాటు గుర్రపు డెక్క కొట్టుకువస్తోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిలో గుర్రపు డెక్క మొక్కలు భారీగా పేరుకుపోగా, కొన్ని ఆనకట్ట అంచున వచ్చిచేరాయి. గుర్రపు డెక్క పేరుకుపోతే ఆనకట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుర్రపు డెక్కతో అనర్థాలు..

గుర్రపు డెక్క నీటిలో పెరిగే కలుపు మొక్క. ఇది వేగంగా పెరిగి నీటి వనరులను మూసుకు పోయేలా చేస్తుంది. దీని వలన నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడుతుంది. ప్రాజెక్ట్ ఆనకట్ట అంచున గురప్రుడెక్క పేరుకుపోతే రివిట్‌మెంట్‌లోకి నీరు అధికంగా వెళ్లి ఆనకట్టకు గండి పడే ప్రమాదం ఏర్పడుతుంది. చేపల పెంపకానికి అంటకంగా మారుతుంది. దీని వలన అధికంగా దోమలు, ఇతర కీటకాలు పెరిగి నీటి నాణ్యతను దెబ్బతీస్తుంది. గుర్రపు డెక్క నీటిలో ఆక్సిజన్ స్థాయిలను తగ్గిస్తుంది. వ్యాధుల వ్యాప్తికి కారణమవుతుంది. ఒక్కసారి నాటుక పోతే తొలిగించడానికి చాలా ఖర్చు అవుతుంది. దీంతో ఆర్థికంగా కూడ తీవ్రంగా ప్రభావం చూపుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆనకట్ట అంచున పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలిగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం..

గుర్రపు డెక్క ప్రాజెక్ట్‌లోకి వరదల వలన కొట్టుకువస్తోంది. తొలిసారి రావడం ఆశ్చర్యంగా ఉంది. గుర్రపు డెక్క సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటుంది. గుర్రపు డెక్క పెరగక ముందే తొలిగించుటకు ఉన్నత అధికారులతో చర్చలు జరుపుతున్నాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

కట్టడి చేసినా.. గంజాయి సరఫరా..

- పొరుగు జిల్లాల నుంచి బాల్కొండ నియోజకవర్గ గ్రామాలకు సప్లయ్
- పోలీసులు పట్టుకుంటున్నా వెరవని స్మగ్లర్లు



మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో గంజాయి కట్టడికి పోలీసులు ఎంత ప్రయత్నం చేస్తున్నా.. స్మగ్లర్లు ఏదో ఒకవిధంగా తమ దందాను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని బాల్కొండ నియోజకవర్గం లోగల పలు గ్రామాలకు పొరుగు జిల్లాల నుంచి గంజాయి సరఫరా కొనసాగుతోంది. నిందితులను పోలీసులు పట్టుకుంటూ, గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నా స్మగ్లర్లు దందాను ఆపడం లేదు.

ఇదీ పరిస్థితి..

బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో పొరుగు జిల్లాలైన జగిత్యాల్, నిర్మల్‌ల నుంచి గంజాయి స్మగ్లర్లు వచ్చి తమ దందాను కొనసాగిస్తున్నారు. తాజాగా కమ్మర్‌పల్లిలో పోలీసులు మెట్‌పల్లికి చెందిన నాంపల్లి వికాస్‌ను అతడికి సహకరిస్తున్న స్థానికుడైన షేక్ ఇమ్రాన్‌ను అరెస్టు చేయడం పరిశీలిస్తే పొరుగు జిల్లాల నుంచి గంజాయి దిగుమతి అవుతుందని వెల్లడవుతోంది. నాంపల్లి వికాస్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతడికి గంజాయి అందించేవారు ఎవరు? ఎంత మొత్తంలో సరఫరా చేస్తారు? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. గంజాయి దందాకు కీలకమైన వ్యక్తులను పట్టుకుంటేనే ఈ దందాను పూర్తిగా అంతమొందించవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

కౌన్సెలింగ్ ద్వారానే మార్పు..

గంజాయికి బానిసలైన యువకులను గుర్తించి వారికి, వారి తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తేనే గంజాయికి పూర్తిస్థాయిలో చెక్ పెట్టవచ్చనే వాదన బలంగా వినిపిస్తోంది. గతంలో మోర్తాడ్ ఎస్సైగా పనిచేసిన సంపత్ గంజాయికి బానిసలైన వారితో పాటు వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు రప్పించి అందరి సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉన్నతాధికారులు స్పందించి కౌన్సెలింగ్ ద్వారానే యువతలో మార్పు తీసుకరావాలని పలువురు సూచిస్తున్నారు.

ఎవరు విక్రయించినా ఉపేక్షించం

గంజాయిని ఎవరైన, ఎక్కడైన విక్రయిస్తే ఉపేక్షించేది లేదు. గంజాయి విషయంలో మా యంత్రాంగం సీరియస్‌గా ఉంది. గంజాయి విక్రయించేవారి గురించి సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. ప్రజల సహకారంతోనే గంజాయిని నిర్మూలించడం సాధ్యమవుతుంది.

– సత్యనారాయణ, సీఐ, భీమ్‌గల్

ఏజెంట్ల మోసంపై విచారణ

- దుబాయ్‌లో చిక్కుకున్న జిల్లావాసితో మాట్లాడిన ఎంబసీ అధికారులు
- వేల్పూర్‌లోనూ పోలీసుల ఆరా



దుబాయ్‌లో చిక్కుకుపోయిన గంగాప్రసాద్

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఏజెంట్ల మోసానికి గురికాగా, ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ విచారణ ప్రారంభించింది. వివరాలు ఇలా.. వేల్పూర్ మండలం పడి గెల వాసి గంగాప్రసాద్ యూర ప్ వెళ్లే ప్రయత్నంలో ఏజెంట్ల మోసానికి గురై దుబాయ్‌లో మూడేళ్ల నుంచి ఇబ్బందికరమైన పరిస్థితిలో ఉండిపోయాడు. ఏజెంట్లు బాధితుడి నుంచి రూ.8.77 లక్షలు వసూలు చేసి టోకరా వేసిన విషయం విధితమే. ఈ విషయంపై బాధితుడి తండ్రి భోజన్న ఇటీవల ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. మరోవైపు గంగాప్రసాద్ సామాజిక మాధ్యమం ద్వారా ఎంపీ అర్వింద్ కార్యాలయానికి ఫిర్యాదు చేశాడు. దీంతో రెండ్రోజుల క్రితం దుబాయ్‌లో ఉన్న గంగాప్రసాద్‌ను విదేశాంగశాఖ అధికారులు ఎంబసీకి పిలిపించుకున్నారు. వారు ఏజెంట్ల పేర్లు, వారి వివరాలను నమోదు చేసుకున్నట్లు బాధితుడు 'సాక్షి'కి ఫోన్‌లో తెలిపారు. తన వీసా గడువు ముగిసిపోగా ఈ అంశంపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారన్నారు. మరోవైపు ప్రవాసీ ప్రజావాణి లేఖ మేరకు విచారణ చేపట్టాలని వేల్పూర్ ఎస్సై సంజీవ్‌ను సీపీ సాయి చైతన్య ఆదేశించారు. దీంతో సదరు ఏజెంట్ల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు.

చీరల చోరీకి పాల్పడిన నిందితుల పట్టివేత

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఓ వస్త్రదుకాణంలో చీరల చోరీకి పాల్పడిన నిందితులను స్థానికులు పట్టుకున్నారు. వివరాలు ఇలా.. భిక్కనూరులోని గాంధీచౌక్ వద్ద గల ఓ వస్త్ర దుకాణంలోకి ఆదివారం ఓ మహిళ, యువకుడితో కలిసి వచ్చింది. దుకాణ యజమానిని వారు చీరలను చూపించమని చెప్పారు. దీంతో యజమాని చీరలను చూపించగా, వారు బేరం ఆడుతున్నట్లు నటించి, ఓ చీరను వారి బ్యాగులో వేసుకున్నారు. అనంతరం ధర గిట్టుబాటు అవడంలేదంటూ వారు అక్కడినుంచి వెళ్లిపోయి మరో వస్త్ర దుకాణంలోకి చేరారు. కొద్దిసేపటికి మొదటి దుకాణ యజమాని చీర చోరీని గుర్తించి, వారి వద్దకు వెళ్లి నిలదీశాడు. మహిళతో ఉన్న యువకుడు మద్య తాగి ఉండటంతో దుకాణ యజమాని బెదిరించాడు. దీంతో స్థానికులు అతడిని చితకబాది, మహిళకు చివాట్లు పెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

క్రైం కార్నర్

డ్రెయినేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫారెస్ట్ ఆఫీస్ వద్ద గల డ్రెయినేజీలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సయ్యద్ ముజాహిద్ తెలిపారు. మురికి కాలువలో మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటన స్థలానికి వచ్చి పరిసరాలను పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేవని, అడి వయస్సు సుమారు 40ఏళ్ల ఉంటాయని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని నెహ్రూనగర్ బస్టాండ్ దగ్గర నెల రోజుల క్రితం ఒక గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్య సమస్యలతో అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. అతడిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని అతడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆదివారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు యాభై ఏళ్లు ఉంటాయని, ఎవరైనా అతడిని గుర్తిస్తే పోలీస్ స్టేషన్‌లో గాని, లేదా 8712659848, 8712659734కు సంప్రదించాలన్నారు.

చోరీకి గురైన బైక్ రికవరీ

సదాశివనగర్(ఎల్లారెడ్డి): చోరీకి గురైన బైక్‌ను నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా.. మండలంలోని పద్మాజివాడి చౌరస్తా వద్ద పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి, వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి అనుమానాస్పదంగా బైక్‌పై వెళుతుండగా పోలీసులు అతడిని ఆపారు. వివరాలు సేకరించగా బైక్‌ను చోరీ చేసి తీసుకువస్తున్నట్లు అతడు పేర్కొన్నాడు. వెంటనే పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకొని, వాహన యజమానికి సమాచారం అందించారు. పట్టుబడ్డ నిందితుడిని కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్టు

సిరికొండ: మండల కేంద్రం శివారులోని ఓ ఫంక్షన్ హాల్ వద్ద గల ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు ఎస్సై రామకృష్ణ ఆదివారం తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.4200 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట శివారులో గల పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు దాడి చేశారు. గ్రామశివారులో పేకాట ఆడుతున్నారని తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్లు ఎస్సై భార్గవ్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు నలుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి మూడు సెల్‌ఫోన్లతో పాటు రూ.1,610 నగదును సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. మండలంలో ఎక్కడా పేకాట ఆడినా తమకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో...

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలోగల ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం సాయంత్రం పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఆరుగురిని పట్టుకొని, వారి వద్ద ఉన్న రూ.29,910 నగదును, 6 సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యంమత్తులో యువకుడి వీరంగం

- ముగ్గురిపై కల్లుసీసాతో దాడి
- నిందితుడిని రిమాండ్‌కు తరలించిన రూరల్ పోలీసులు





గాయపడిన దీపిక, శైలేందర్

నిజామాబాద్ రూరల్: మండలంలోని గూపన్‌పల్లి గ్రామంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించి, ముగ్గురిపై దాడిచేసి గాయపర్చాడు. నిందితుడిని పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మదన్ అనే వ్యక్తి శనివారం రాత్రి కల్లుబట్టిలో మద్యం తాగి సమీపంలో గల అనిల్ అనే వ్యక్తి ఇంటి ఎదుట నిద్రించాడు. కొద్దిసేపటికి ఇంటికి చెందిన అనిల్, శైలేందర్‌లు ఇంట్లోకి వెళుతుండగా మదన్‌కు కాళ్లు తగలడంతో మేల్కొన్నాడు. దీంతో మదన్ వారితో వాగ్వాదానికి దిగాడు. అనంతరం మదన్ పగిలిన కల్లుసీసాతో శైలేందర్ ఎడమచేతిని గాయపరిచారు. అనిల్, అతడి అక్క దీపిక అడ్డురావడంతో మదన్ వారిపై సైతం దాడిచేసి గాయపర్చారు. వెంటనే గ్రామ పెద్దలు ఘటన స్థలానికి చేరుకొని ఇరువురిని సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ ఘటనపై బాధితులు మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి, నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

సిరికొండ: మండలంలోని చీమన్‌పల్లి గ్రామంలో ఓ వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చందాల లక్ష్మీ(63) అనే వృద్ధురాలు గత కొన్ని రోజుల నుంచి మానసిక స్థితి సరిగా ఉండటం లేదు. ఒంటరిగా నివసించడంతో తీవ్ర మనోవేదనకులోనై తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

హాస్టల్ వార్డెన్..



షబానా (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహం వార్డెన్ షబానా ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన షబానా గత సంవత్సరం ఆగస్టులో ఆర్మూర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో విధుల్లో చేరింది. ఆర్మూర్ పట్టణంలోనే ఉంటూ విధులు నిర్వహిస్తుండేది. కాగ రెండు రోజులు సెలవులు రావడంతో ఆమె జగిత్యాలలోని ఆమె ఇంటికి వెళ్లింది. ఆమె స్వగృహంలో శనివారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకుంది.ఈ ఘటనపై తోటి ఉద్యోగులు, హాస్టల్ విద్యార్థినులు విచారం వ్యక్తం చేశారు.